క్లుప్తంగా

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి



భక్తులకు ప్రవచనాలు వినిపిస్తున్న గురూజీ అనిల్‌కుమార్‌జోషి

కందుకూరు: ఆధ్యాత్మికతతోనే ప్రశాంత జీవితాన్ని గడపాచ్చని బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి సూచించారు. బుధవారం మౌని అమావాస్యను పురస్కరించుకొని మండలంలోని పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో ప్రత్యేకంగా హోమం నిర్వహించారు. పూర్ణాహుతి చేసి భక్తులకు గురూజీ ఆశీర్వాదాలు, అన్నప్రసాదం అందించారు. ఈ సందర్భంగా ఆయన ప్రవచనాలు చేశారు. ప్రతి నిత్యం కొంత సమయాన్ని భగవంతుడి సాధనకు కేటాయించాలన్నారు. సాధనా మార్గంలో పయనిస్తే కష్టసాధ్యమైన పనులను కూడా సులభరీతిలో పూర్తి చేయొచ్చని తెలిపారు. అందరూ నిత్యం తాము చేసే విధులతో పాటు పది మందికి ఉపయోగపడే మంచి పనులను చేస్తూ మంచి మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఆలయానికి స్థలం కేటాయించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

కందుకూరు: మండల పరిధిలోని కొత్తగూడలో పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరుతూ మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సామ ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ముదిరాజ్ సంఘం నాయకులు బుధవారం స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసి కోరారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి స్థలం కేటాయించేలా చూస్తానని ఆమె వారికి ఈ సందర్భంగా హామీనిచ్చారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ మండల సోషల్ మీడియా కన్వీనర్ బొక్క దీక్షిత్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పిట్టల శేఖర్, నర్సింహ, యాదయ్య, సత్తయ్య, సత్యనారాయణ, శేఖర్, నరేందర్, సురేశ్, బొక్క వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ జైన్ మందిర్, 11కేవీ మారుతీనగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

కార్పొరేట్ సంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు



మాట్లాడుతున్న పర్వతాలు

మహేశ్వరం: భవన నిర్మాణ రంగంలో వలస కార్మికులను శ్రమ దోపిడీకి గురిచేసి మోసం చేస్తున్న కార్పొరేట్ సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో కాకి సత్యానారాయణ ఫంక్షన్ హాలులో భవన నిర్మాణ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి పనిచేస్తున్న వలస కార్మికులను బడా కార్పొరేట్ కంపెనీలు శ్రమ దోపిడీకి గురి చేస్తున్నాయన్నారు. భవన నిర్మాణ కార్మిక చట్టం ప్రకారం వేతనాలు చెల్లించకుండా తక్కువ వేతనాలు ఇచ్చి పని చేయించుకుంటున్నారన్నారు. లేబర్ అడ్డాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. బయోమెట్రిక్ విధానాలతో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని, తక్షణమే వాటిని మార్చాలని కోరారు. అనంతరం కార్మికుల కర్తవ్యాలను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి దత్తునాయక్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేశ్, నాయకులు దాసరి ప్రసాద్, నర్సింహారెడ్డి, గోపాల్, దేవేందర్, బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

నెరవేరని లక్ష్యం

నిధులు ఖాళీ..!
అభివృద్ధి అంతంతే

- అస్తవ్యస్తంగా నాలాల పనితీరు
- ముందుకు సాగని మురుగు జలాలు
- ముగిసిన పాలకవర్గం పదవీకాలం..
- అభివృద్ధిని గాలికి వదిలేశారంటూ ఆరోపణలు



బడంగ్‌పేట్‌లో లింకు వదిలేసిన ఎస్ఎన్‌డీపీ నాలా దుస్థితి



నాదర్‌గుల్‌లో అభివృద్ధికి నోచుకోని ఓపెన్ నాలా

బడంగ్‌పేట్: ప్రజాస్వామ్య విధానంలో గ్రామాలను.. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లుగా ప్రభుత్వాలు ఏర్పాటు చేశాయి. అభివృద్ధి చెందేలా విధివిధానాలు రూపొందించాయి. అలా ఏర్పడినదే బడంగ్‌పేట నగర పాలక సంస్థ. గడిచిన ఐదేళ్ల కాలంలో అనేక నిధులు వెచ్చించి ప్రాంతాన్ని అభివృద్ధి చేశామని, ప్రజలకు మౌలివసతులు కల్పించామని నిన్నమొన్నటి వరకు కొనసాగిన పాలకవర్గం పేర్కొంది. కానీ నిధులు ఖర్చుచేసినా.. లక్ష్యం నెరవేరలేదని, కార్పొరేషనలో అనేక సమస్యలు తిష్ట వేశాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

విమర్శలు మూటగట్టుకుంది

బడంగ్‌పేట కార్పొరేషన్‌ను 32 డివిజన్లుగా విభజించి, ఒక్కో డివిజన్‌కు ఒక్కో కార్పొరేటర్‌ను ఎన్నుకుని పాలన సాగించారు. కార్పొరేషన్‌లో హెచ్ఎండీఏ, ఎల్ఆర్ఎస్, జనరల్ ఫండ్, ఎస్‌జీఎస్, స్టాంప్ డ్యూటీస్, 14,15వ ఫైనాన్స్, ఇతర మార్గాల ద్వారా వచ్చిన నిధులను వెచ్చించి, గడిచిన 5 సంవత్సరాల్లో అభివృద్ధి పేరిట రూ.450 కోట్లతో బడంగ్‌పేటను తీర్చిదిద్దామని పాలకవర్గం పేర్కొంది. ఇటీవల వారి పాలనకాలం ముగిసింది. కానీ.. మేజర్ పనులను పట్టించుకోక గాలికొదిలేశారని పాలకవర్గం విమర్శలు మూటగట్టుకుంది.

నాలా పనుల విస్మరణ

నాదర్‌గుల్‌లో ఓపెన్ మురుగునీటి కాలువ ప్రధాన రహదారి పక్కనుంచి పారుతున్న నాలా నిర్మాణాన్ని పాలకవర్గం, అధికారులు విస్మరించారు. అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్.. నాలాను పరిశీలించి నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. అయినా.. సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు. నాదర్‌గుల్ మురుగునీరు తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువులో చేరుతుంది. మల్లాపూర్ నుంచి బాలాపూర్ మధ్య వరకు ప్రధాన రహదారికి ఆర్‌బీఐ రోడ్డుకు ఆనుకుని మురుగు జలాలు భారీగా పారుతున్నాయి. నాలాను నిర్మించి, మురుగును దారి మళ్లించడంలో అధికారులు, పాలకులు విఫలం అయ్యారన్న విమర్శలు లేకపోలేదు. ముంపు ప్రాంతాలను దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వ హయాంలో దిల్‌సుఖ్‌నగర్ పబ్లిక్ స్కూల్ ఎదురుగా మూల మలుపు వద్ద వరదనీరు వెళ్లడానికి ఎస్ఎన్‌డీపీ నాల పనులు చేపట్టారు. కానీ.. ఇతర నాలాలకు లింక్ కలపక పోవడంతో రోడ్డుపేనే వ్యర్థాలు ప్రవహిస్తూ తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దీనికి స్థానికులు నిరసనలు వ్యక్తం చేసినా ఎవరూ పట్టించుకోలేదు.

జోరుగా కబ్జాలు

కార్పొరేషన్‌లోని జల్‌పల్లి మీదుగా మల్లాపూర్, కుర్మల్‌గూడ, బాలాజీనగర్, వెంకటాపూర్, నాదర్‌గుల్, గుర్రంగూడ మీదుగా ఫిరంగి నాలా వెళ్తోంది. ఆ నాలా చాలా వరకు కబ్జాకు గురైనా ఎవరూ పట్టించుకోవడం లేదు. బడంగ్‌పేటలో రోడ్డు విస్తరణ పనులు మధ్యలోనే ఆపేశారు. విస్తరణలో భాగంగా ఇళ్లను కోల్పోయిన బాధితులకు పరిహారం చెల్లించకపోవడంతో స్థానికుల నిరసనలతో నిర్మాణ పనులకు ఆటంకం కలిగింది. చెరువులు, పార్కు స్థలాలు, ఓపెన్ స్థలాలు, ఓపెన్ నాలాలను కొందరు కబ్జా చేసి, అక్రమంగా నిర్మాణాలు చేపట్టినా అధికారులు సంబంధిత వ్యక్తులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదే అంశంపై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు.

సమస్యల తిష్ట

గడిచిన ఐదేళ్ల కాలంలో రూ.450 కోట్లతో పార్కులు, సీసీ, బీటీరోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్, శ్మశానాల అభివృద్ధి, వీధి దీపాలు, రహదారుల విస్తరణ, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు తదితర పనులు చేశామని పాలకవర్గం ప్రచారం చేసుకుంది. కానీ కార్పొరేషన్ పరిధిలో ఏళ్లతరబడి పేరుకుపోయిన సమస్యలను ఎవరూ పట్టించుకోలేదని స్థానికులు బాహటంగానే విమర్శిస్తున్నారు.

ప్రతి ఫిర్యాదుపై స్పందిస్తాం



ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి చర్యలు తీసుకుంటాం. సమస్యలపై తక్షణమే స్పందిస్తాం. ఎవరికైనా అన్యాయం జరిగిందని ఆధారాలతో సమర్పిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, న్యాయం జరిగేలా చూస్తాం. పాలకవర్గం పదవీకాలం ముగిసినందున.. ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులు చేపడతాం. ప్రజలు సహకరించాలి.

– పి.సరస్వతి, కమిషనర్

విజేతలకు బహుమతులు ప్రదానం



తుక్కుగూడ: విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు



కందుకూరు: టోర్నీ ప్రారంభోత్సవంలో ఏబీవీపీ, బీజేపీ నాయకులు

తుక్కుగూడ: మున్సిపాలిటీలో ఏబీవీపీ నగర శాఖ ఆధ్వర్యంలో ఖేలో భారత్ క్రీడోత్సవ్–2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా పాఠశాల విద్యార్థులకు పలు రకాల క్రీడాపోటీలు నిర్వహించారు.ఈ పోటీల్లో గెలిపొందిన విజేతలకు బుధవారం విశ్రాంత అదనపు కలెక్టర్ బీఎస్‌వీవీఎస్ మూర్తి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సాయిచరణ్, కిరణ్‌కుమార్, గుణవంత్, వెంకటరమణ, అఖిల్,మహేశ్,శంకర్, సోను, వరుణ్ పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో క్రీడోత్సవాలు

కందుకూరు: ఏబీవీపీ కందుకూరు శాఖ ఆధ్వర్యంలో ఖేలో భారత్ క్రీడోత్సవ్–2025 కార్యక్రమాన్ని బుధవారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు రకాల పోటీలను నిర్వహించారు. అనంతరం ఏబీవీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కందడి శ్రీరామ్ మాట్లాడారు. యువత దేశానికి పట్టుకొమ్మలని, చెడు మార్గంలో నడవకుండా క్రమ శిక్షణతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మంద జ్యోతిపాండు, ఏబీవీపీ విభాగ్ సంఘటన మంత్రి పృథ్వీజీ, వీరపట్నం జిల్లా కన్వీనర్ శివకృష్ణ, బీజేపీ మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి, ఏబీవీపీ నగర అధ్యక్షుడు వెంకటేశ్, కార్యదర్శి ఢిల్లీ భానుప్రసాద్, టౌన్ జాయింట్ సెక్రటరీ జ్యోతిప్రసాద్, అమరేందర్, ఉపాధ్యక్షుడు నర్సింహ, కార్యకర్తలు దినేశ్, అభిరామ్, జగన్, చందు, పూర్వ ఏబీవీపీ నాయకులు ఢిల్లీ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కనిపించని మార్పు!

- చెత్త వేయొద్దని ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా ఫలితం శూన్యం



ఫ్లెక్సీల ఎదుట వేసిన చెత్తా, చెదారం

శంకర్‌పల్లి: ప్రస్తుత కాలంలో ఒకరు మరొకరికి చెబితే విని మారే పరిస్థితిలో లేరు అనడానికి ఈ చిత్రమే నిదర్శనం. ఇచ్చట చెత్త, మూత్రవిసర్జన చేయరాదని విద్యుత్ శాఖా అధికారులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినప్పటికీ కొంత మందిలో కనీస మార్పు రావడం లేదు. శంకర్‌పల్లి–సంగారెడ్డి ప్రధాన రహదారిలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఉంది. దీని చుట్టు పక్క కాలనీల ప్రజలు నిత్యం చెత్తను తీసుకొచ్చి వేయడంతో అధికారులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ ప్రజల్లో మార్పు రావడం లేదు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు పుర ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కేశంపేట: మండల పరిధిలోని అల్వాల గ్రామ శివారులో ఉన్న 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్‌ల కారణంగా అల్వాల, కొత్తపేట, ఎక్లాస్‌ఖాన్‌పేట, సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న గ్రామాలకు గురువారం విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ ఈశ్వర్ తెలిపారు. ఆయా గ్రామాల్లో మధ్యాహ్నం 2.30ల గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలివేస్తామని, ఈ విషయాన్ని రైతులు, ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఫంక్షన్ హాళ్లపై కేసు నమోదు

శంకర్‌పల్లి: నిబంధనలు అతిక్రమించి ఫంక్షన్ హాలులో డీజే సౌండ్ సిస్టం నడిపిన రెండింటిపై శంకర్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లిలో బుధవారం మణిగార్డెన్, మోయిన్ ఫంక్షన్ హాళ్లలో డీజేలు పెట్టి శబ్ద కాలుష్యాన్ని సృష్టిస్తున్నట్లు ఫిర్యాదు అందగా.. పోలీసులు వెళ్లి పరిశీలించారు. అనంతరం హాళ్ల యాజమానులతో పాటు డీజే నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా సౌండ్ సిస్టం పెట్టుకోవద్దని, అలాంటి వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

ఘనంగా ఉర్సు ఉత్సవాలు

ఆమనగల్లు: ఉర్సు ఉత్సవాలను బుధవారం ముస్లిం మత పెద్దలు అబ్దుల్ నయీం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తలకొండపల్లి మండల పరిధి వెల్జాల గ్రామంలోని దర్గా వద్ద ఉత్సవంలో భాగంగా ఊరేగింపు నిర్వహించి, ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఫాతిహా సమర్పించారు. మత పెద్దలు అబ్దుల్ ఖలీం, అబ్దుల్ రహీం, బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు సీఎల్. శ్రీనివాస్‌యాదవ్, జెడ్పీకో ఆప్షన్ మాజీ సభ్యుడు ముజుబుర్ రెహ్మాన్‌లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు భీమ్

చేవెళ్ల: కుల అహంకార హత్యలు ఇంకా కొనసాగటం బాధాకరమని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు భీమ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. నల్గొండ జిల్లా సూర్యాపేటలో మాల సామాజిక వర్గానికి చెందిన బంటి(వడ్లకొండ కృష్ణ)ని కుల అహంకారంతో హత్య చేయడాన్ని త్రీవంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. బంటిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గత కొంతకాలంగా మాలలపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. మాల సామాజిక వర్గానికి చెందిన కవులు, మేధావులు, ఉద్యమకారులపై పాటలు, రచనలు, మాటలతో దాడులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సమాజం ముందు మాల సమాజాన్ని దోషులుగా చిత్రీకరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మాలలు మేల్కొని అస్థిత్వం కోసం పోరాటానికి పోరాడాలని సూచించారు.

శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు జేఏసీ నాయకుల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: స్థానిక పరిశ్రమలలో యువతకు ఉద్యోగాల రూపకల్పనలో భాగంగా వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జేఏసీ తాలుకా అధ్యక్షుడు జనార్థన్ కోరారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో జేఏసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో సుదీర్ఘకాలంగా ఎదురు చూస్తున్న అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో దాదాపు 500 పరిశ్రమలు ఉంటాయని, మరెన్నో మల్టీ నేషనల్ కంపెనీలు ఏర్పాటవుతున్నాయన్నారు. యువతకు సరైన శిక్షణ లేకపోవడంతో ఇతర రాష్ట్రాల వారు ఇక్కడి పరిశ్రమలలో ఉద్యోగాలు చేస్తున్నారని, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో విద్యార్థుల కోసం ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. రైతాంగానికి సాగునీరందించేందుకు నిర్మిస్తామని చెప్పిన లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణం పెండింగ్‌లో ఉందన్నారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును పూర్తిచేసి వ్యవసాయ రంగానికి సాగునీరందించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, జేఏసీ నాయకులు నక్కబాల్‌రాజ్, రాము, అర్జున్‌కుమార్, బాదేపల్లి సిద్ధార్థ, నర్సింలు తదితరులు ఉన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

మండల విద్యాధికారి కస్నా నాయక్



ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ

మహేశ్వరం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని మండల విద్యాధికారి కస్నానాయక్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రం గడికోట మైదానంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీలు ముగిశాయి. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. పోటీల్లో 14 పాఠశాలలు పాల్గొన్నాయి. కబడ్డీ పోటీల్లో వివేకానంద హైస్కూల్, ఖోఖోలో మొదటి బహుమతి శ్రీరామచంద్రస్కూల్, బాలికల ఖోఖోలో మొదటి బహుమతి టీఎస్ మోడల్ స్కూల్ విద్యార్థులు గెలుపొందారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కందాడి శ్రీరామ్, ఏబీవీపీ మహేశ్వరం నగర అధ్యక్షుడు శ్రీనివాస్, నగర కార్యదర్శి రాజేశ్, కార్యకర్తలు రాఘవేంద్ర, వంశీ, ప్రణీత్, సయిద్, రోహిత్, అభిలాశ్, దుర్గ, సాయి కార్తీక్, శ్రీకాంత్, పూర్వ విద్యార్థులు దేవేందర్‌నాయక్, శివకుమార్ పలువురు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన సీనియర్ నాయకుడు



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

మహేశ్వరం: మహేశ్వరం నియోజకవర్గంలో మార్కెట్ కమిటీ డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు బుధవారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మలను మహేశ్వరం మండల ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నేనావత్ రాజునాయక్, మండల ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నడికూడ శివకుమార్, కాంగ్రెస్ నాయకులు రవి నాయక్‌లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

విద్యారంగాభివృద్ధికి ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

- ఈనెల 31న మొగిలిగిద్దకు సీఎం రేవంత్‌రెడ్డి రాక
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: విద్యారంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత పాలకులు విద్యను పూర్తిగా గాలికి వదిలేశారని, దీంతో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన సీఎం రేవంత్‌రెడ్డి విద్యారంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారన్నారు. హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచారని, ప్రతీ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు మంజూరు చేసినట్లు తెలిపారు.

ఈ నెల 31న మొగిలిగిద్ద సీఎం రాక

ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాల 150 ఏళ్ల వేడుకలను ఈ నెల 31న నిర్వహిస్తున్నట్లు, ఎంతో ఘన చరిత్ర ఉన్న ఈ వేడుకలకు సీఎం రేవంత్‌రెడ్డి విచ్చేస్తున్నట్లు తెలిపారు. విద్యాభివృద్ధికి సంబంధించిన కార్యక్రమంపై సాయంత్రం 4గంటలకు గ్రామ శివారులోని మైదానంలో 10వేల మందితో నిర్వహించే బహిరంగ సభలో సీఎం పాల్గొంటారని తెలిపారు. మొగిలిగిద్ద గ్రామ వాసి అయిన ప్రొఫెసర్ హరగోపాల్ వృద్ధాప్యంలో కూడా విద్యాభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. సీఎం రాకతో గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, మండల పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సభ నిర్వహణకు స్థల పరిశీలన

మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల 150 ఏళ్ల ఉత్సవాలకు ఈ నెల 31న సీఎం రేవంత్‌రెడ్డి విచ్చేయనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించే బహిరంగ సభకు గ్రామ శివారులోని కందివనం రోడ్డులో ఉన్న 16 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మైదానాన్ని బుధవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పోలీసు అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. 10 వేల మందితో నిర్వహించే బహిరంగ సభలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, సయ్యద్ సాధిక్, ఇబ్రహీం, ఖదీర్, ముబారక్, కందివనం సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు సతీశ్‌రెడ్డి

షాబాద్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు సతీశ్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం చేవెళ్లలో 30 అడుగుల జెండా ఆవిష్కరణకు షాబాద్ మండలం నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా చూడాలని సూచించారు. బూత్ స్థాయి నుంచి ప్రతీ గ్రామంలో బీజేపీని పటిష్ట చేద్దామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాణెయ్య, జిల్లా యువ మోర్చా అధికార ప్రతినిధి కూతురు మహేందర్, మాజీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, నాయకులు రాజీవ్‌రెడ్డి, సురేశ్, మహేశ్, కృష్ణచారి, ప్రశాంత్, విఠలయ్య, రవీందర్, విజయ్, ఆనందం, మల్లేశ్, జగదీశ్, శివారెడ్డి, అశోక్, నరేందర్‌రెడ్డి, శివరాజ్ ఉన్నారు.

రాజ్యాధికారంతోనే బీసీల అభివృద్ధి



నూతన సభ్యులకు నియామకపత్రం అందిస్తున్న ప్రదీప్‌కుమార్

బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: రాజ్యాధికారాన్ని సాధించినప్పుడే బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారని బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మానపాటి ప్రదీప్‌కుమార్ అన్నారు. పట్టణంలోని క్యాసెట్ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్‌లో బుధవారం బీసీ మహాసభ జిల్లా అధ్యక్షుడు క్యాసెట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రదీప్‌కుమార్ హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీలు ఎదుర్కొంటున్న సమస్యల సాధనకు సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలను అన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో బీసీలు వెనుకబడిపోతున్నారన్నారు. సబ్బండ కులాలకు కావాల్సిన అవసరాలను, సంక్షేమ పథకాలను సాధించుకోవాలంటే ఐకమత్యంతో ఉద్యమించాలని సూచించారు. బీసీలు రాజ్యాధికారంతో చట్టసభలలో ప్రవేశించినప్పుడే మన హక్కులను సాధించుకుంటామన్నారు. రానున్న స్థానిక ఎన్నికలలో మనకు మనమే పోటీ కాకుండా మన ఓట్లను మనమే వేసుకొని విజయం సాధించాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. బీసీ మహాసభ మండల అధ్యక్షుడిగా మేకల వెంకటేశ్, తాలుకా యువత విభాగం అధ్యక్షుడిగా పాలాది శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీసీ మహాసభ రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షుడు కృష్ణాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి యాదయ్య, జిల్లా కార్య కార్యదర్శి మాధవాచారి, యువత విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌వర్మ, అశోక్, ప్రవీణ్‌గౌడ్, రాజు, వెంకటేశ్, నవీన్, హరికృష్ణ, భరత్ పాల్గొన్నారు.